
ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 31.0
కనిష్ఠం 24.2
***

ANDHRAJYOTHY



నల్లగొండ

5


మంగళవారం 20 ఆగస్టు 2024

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	589 (311.1486)	37,540	45,107
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	645 (4.46)	624.52	565.92
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	174.57 (45.10)	16,000	16,000

చికెన్ ధరలు | లైవ్ : రూ.110 | డ్రెస్ : రూ.190 | స్కిన్‌లెస్ : రూ.210

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఈ సీజన్‌లో సాగునీటి విషయంలో రైతులకు భరోసా నెలకొంది. ఉమ్మడి జిల్లాలోని ప్రాజెక్టులన్నీ నిండుకుండలను తలపిస్తున్నాయి. 12 లక్షల ఆయకట్టు కలిగిన నాగార్జునసాగర్‌లో గరిష్టస్థాయిలో నీటిని నిల్వ చేశారు. ఎగువ నుంచి వరద కొనసాగిన 14 రోజుల్లో మొత్తంగా 200 టీఎంసీల నీరు దిగువకు విడుదల చేశారు. అందులో 130 టీఎంసీల నీరు క్రస్ట్‌గేట్ల నుంచి సాగరానికి వెళ్లాయి. సోమవారం వరద తగ్గుముఖం పట్టడంతో క్రస్ట్‌గేట్లను మూసివేశారు. మధ్య తరహా ప్రాజెక్టుల్లో ఒకటైన మూసీ ప్రాజెక్టుకు నెల రోజులుగా వరద కొనసాగుతోంది. దీంతో ఆయకట్టు కుడి, ఎడమ కాల్వలకు నిరంతరంగా సాగునీటి అవసరాల కోసం నీటిని విడుదల చేస్తున్నారు. అదేవిధంగా పులిచింతల ప్రాజెక్టులోనూ గరిష్టస్థాయి నీటినిల్వ కొనసాగుతోంది.



నిండుగా నీటితో కళకళలాడుతున్న నాగార్జునసాగర్ ప్రాజెక్టు

సాగునీటికి భరోసా

- ఉమ్మడి జిల్లాలోని ప్రాజెక్టుల్లో జలకళ
- గరిష్ట స్థాయిలో నీటి నిల్వలు
- 14 రోజుల్లో సాగర్ నుంచి 200 టీఎంసీలు దిగువకు


నాగార్జునసాగర్, ఆగస్టు 19 : నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద రాక తగ్గటంతో క్రస్ట్‌గేట్లను సోమవారం ఉదయం మూసివేశారు. సాగర్‌కు ఎగువనుంచి జూలై 29వ తేదీ నుంచి వరద రాక మొదలుకాగా, ఈ నెల 5వ తేదీ నుంచి సాగర్ క్రస్ట్ గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. (మధ్యలో ఈ నెల 12వ తేదీన ఒక్కరోజు క్రస్ట్ గేట్లను మూసివేశారు). సాగర్ నుంచి 14రోజుల్లో మొత్తం 200 టీఎంసీల నీరు విడుదల చేయగా, అందులో క్రస్ట్ గేట్ల నుంచి 130 టీఎంసీలు కడలిపాలైంది. మరో 70 టీఎంసీలు కుడి, ఎడమ, వరద కాల్వల ద్వారా, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా విడుదల చేశారు. సాగర్‌కు ఎగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు (215.8070టీఎంసీలు) కాగా శ్రీశైలానికి ఎగువనుంచి 66,379 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. శ్రీశైలం నీటిమట్టం సోమవారం సాయంత్రానికి 881.30 అడుగులుగా (195.2102టీఎంసీలు) ఉంది. శ్రీశైలం ప్రాజెక్టు ఎడమగట్టు జలవిద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 37,540 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు వదులుతున్నారు. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు (312.0450టీఎంసీలు) కాగా సోమవారం సాయంత్రానికి 589.70 అడుగులుగా(311.1486టీఎంసీలు) ఉంది. సాగర్ నుంచి కుడికాల్వ ద్వారా 8,067 క్యూసెక్కులు, ఎడమకాల్వ ద్వారా 5,367 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,273 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800 క్యూసెక్కులు, వరదకాల్వ ద్వారా 600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 45,107 క్యూసెక్కుల నీరు విడుదల అవుతుండగా ఎగువ నుంచి 37,540 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పూర్తిస్థాయి నీటిమట్టానికి పులిచింతల

మేళ్లచెర్వు: ఉభయ తెలుగు రాష్ట్రాల సరిహద్దులో గల పులిచింతల ప్రాజెక్టు ఈ సీజన్‌లో మొదటిసారి పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకుంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 175 అడుగులు(45.77 టీఎంసీలు) కాగా సోమవారం మధ్యాహ్నానికి పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకుంది. ఎగువనుంచి 16వేల క్యూసెక్కులు నీరు వస్తుండగా, తెలంగాణ జల విద్యుత్ కేంద్రం నుంచి 16వేల క్యూసెక్కుల నీటిని వినియోగిస్తూ 4 యూనిట్ల ద్వారా 104 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేస్తున్నారు. ప్రాజెక్టు ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో 16 వేల క్యూసెక్కులుగా నమోదైంది.



మూసీకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో..



కేతేపల్లి : నల్లగొండ, సూర్యాపేట జిల్లా పరిధిలోని మూసీ ప్రాజెక్టుకు ఎగువనుంచి వరద నిలకడగా కొనసాగుతోంది. హైదరాబాద్ జంటనగరాలతో పాటు ఎగువ మూసీ పరివాహక ప్రాంతాల్లో విస్తారంగా కురుస్తున్న వర్షాలకు గత కొద్ది రోజులుగా వరద నీరు దిగువన గల మూసీ ప్రాజెక్టుకు వచ్చి చేరుతోంది. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రానికి 971.86క్యూసెక్కులుగా ఉన్న ఇన్‌ఫ్లో సోమవారం సాయంత్రానికి 624.52 క్యూసెక్కులుగా నమోదైంది. 645అడుగుల (4.46టీఎంసీ) పూర్తి నీటిమట్టం కలిగిన మూసీ ప్రాజెక్టు ప్రస్తుత నీటిమట్టం 642.60అడుగులుగా(3.81టీఎంసీ) ఉంది. మూసీ ఆయకట్టులో వానాకాలం పంటల సాగు నిమిత్తం కుడి కాల్వకు 306.54క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 259.38క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

ఉక్కపోత నుంచి ఉపశమనం



చింతపల్లి / శాలిగౌరారం / కేతేపల్లి / మునుగోడు : చింతపల్లి మండలంలోని వేంకటేశ్వరనగర్‌లో సోమవారం మధ్యాహ్నం గంట పాటు కురిసిన వర్షానికి పలు కాలనీలు పూర్తిగా జలమయమయ్యాయి. అదేవిధంగా శాలిగౌరారం మండల కేంద్రంతో పలు గ్రామాల్లో సోమవారం రాత్రి గంటకుపైగా ఉరుముల, మెరుపులతో భారీ వర్షం పడింది. దీంతో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మెట్టపంటలకు ఈ వర్షం ప్రాణం పోసినట్లు అయిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత కొన్ని రోజుల నుంచి ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అయిన ప్రజలకు వాతావరణం ఒక్కసారిగా చల్లబడి వర్షం పడడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. కేతేపల్లి సాయంత్రం మబ్బులతో చిమ్మచీకట్లు నెలకొన్నాయి. అయితే వర్షం మాత్రం కాస్తంతే కురిసింది. మునుగోడు పరిసర ప్రాంతంలో సోమవారం ఒక్కసారిగా ఆకాశమంతా మేఘాలు కమ్మేశాయి. ఉరుములు, మెరుపులతో చిరుజల్లులు కురిశాయి.

కుప్పకూలిన కోళ్ల షెడ్: యజమానికి తీవ్రగాయాలు

గుర్రంపోడు: మండలంలో సోమవారం సాయంత్రం ఆరుగంటల నుంచి గంట పాటు ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ ధాటికి మండలంలోని పిట్టలగూడెంలో రామసాని నరేందర్‌రెడ్డికి చెందిన కోళ్ల షెడ్ కుప్పకూలింది. షెడ్డులో ఉన్న నరేందర్‌రెడ్డిపై ఇటుక గోడ కూలింది. పక్కనే షెడ్‌లో ఉన్న కుటుంబ సభ్యులు గ్రామస్థులకు సమాచారం అందించారు. వర్షం కురుస్తుండగానే 25 మంది వెళ్లి బయటికి లాగారు. అప్పటికే నరేందర్‌రెడ్డికి తీవ్ర గాయాలతో పాటు కాలు విరిగింది. నరేందర్‌రెడ్డిని స్థానికులు నల్లగొండ ఆస్పత్రికి తరలించారు. కోళ్ల షెడ్డు కూలినందున ఐదు వేల కోడి పిల్లలు మృతి చెంది రూ.లక్ష నష్టం వాటిల్లింది.

ఆర్టీసీలో టార్గెట్ల కలకలం

- గతంలో మాదిరి నిర్దేశిస్తున్న అధికారులు?
- పురుష ప్రయాణికులను ఎక్కించాలని ఆదేశం
- తలపట్టుకుంటున్న సిబ్బంది



7

ఆర్టీసీ సంస్థ ఆదాయం కోసం సిబ్బందికి టార్గెట్లను నిర్దేశిస్తున్నట్లు సమాచారం. ఈమేరకు ఇప్పటికే కొన్నిరూట్లలో సిబ్బందికి ఆదేశాలు ఇచ్చినట్లు తెలిసింది. అయితే ఇది సిబ్బందికి కొత్త తలనొప్పిని తెచ్చిపెడుతోంది. బస్సులు చూస్తే ఫుల్‌గా కనిపిస్తున్నా ఎక్కువ శాతం మహిళలు ఉండటంతో ఆదాయం కనిపించడం లేదు. దీంతో పురుష ప్రయాణికులను బస్సుల్లోకి ఎక్కించుకుని ఆదాయాన్ని పెంచాలనే టార్గెట్లను ఇస్తున్నట్లు సమాచారం. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక ఉన్న ప్రతీ రూట్‌లో కొంతమొత్తాన్ని టార్గెట్‌గా నిర్ణయించేవారు. అయితే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అమలుచేయడం లేదు. అయితే ఆదాయం తక్కువగా వస్తుండటంతో అధికారులు తిరిగి సిబ్బందికి టార్గెట్లను నిర్ణయిస్తున్నట్లు తెలుస్తోంది. అధికారుల ముందు సరేనంటున్న సిబ్బంది పురుష ప్రయాణికులను ఎక్కడి నుంచి తీసుకురావాలని అర్థంకాక తలపట్టుకుంటున్నారు. - మోత్కూరు

చెర్వుగట్టులో దర్శన దారి మళ్లింపు

భక్తుల సౌకర్యార్థం మరోమార్గంలో వెళ్లేలా ఏర్పాట్లు

వీఐపీ పర్యటన నేపథ్యంలో ఇబ్బందులు పడుతున్న భక్తులు



6

చెర్వుగట్టు జడల రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో పలు మార్పులకు అధికారులు శ్రీకారం చుట్టనున్నారు. దక్షణ మార్గం వైపు ఉన్న మెట్ల మార్గం ద్వారా భక్తు లు ఆలయంలోకి ప్రవేశిస్తున్నారు. అయితే ఎండా, వానాకాలంలో భక్తులు క్యూలైన్లలో బండరాయిపై ఉంటూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అదీకాక ఇదే మార్గంలో వీఐపీలు దర్శనానికి వెళ్తుంటారు. దీంతో వీఐపీల పర్యటన సమయంలో అటు దేవస్థాన అధికారులకు, భక్తులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ కష్టాలకు కొంతమేరకైనా చెక్ పెట్టేందుకు అధికారులు దర్శన దారిని మళ్లించారు. ఆలయానికి ఆనుకుని సత్రానికి వెళ్లేదారిలో మూడు వరుసల్లో క్యూలైన్లను ఏర్పాటు చేసే ప్రయత్నాల్లో ఉన్నారు. ఇదే దారిలో షెడ్డు ఉండటంతో ఎండా, వానకు ఇబ్బంది పడకుండా కొంతమేరకైనా భక్తులు ఉపశమనం పొందనున్నారు. - నార్కట్‌పల్లి



అనుబంధాల రక్షాబంధన్

జిల్లాలో రక్షాబంధన్‌ను ఘనంగా నిర్వహించుకున్నారు. ఆడపడుచులు తమ సోదరులకు రాఖీ కట్టి అనుబంధాన్ని చాటుకున్నారు. పలుచోట్ల అధికారులకు, ప్రజా ప్రతినిధులకు స్వచ్ఛంద సంస్థల బాధ్యులు, కార్యకర్తలు రాఖీలు కట్టారు. హైదరాబాద్‌లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి ఆయన సోదరి రాఖీ కట్టారు. -8లో

దారుల్లో పండుగ రద్దీ




వరుసల సెలవులకు తోడు రాఖీ పండుగ నేపథ్యంలో జిల్లాలోని ప్రధాన రహదారులన్నీ వాహనాలతో కిక్కిరిసాయి. వాహన రాకపోకలతో రోజంతా సందడి నెలకొంది. జిల్లాలోని హైదరాబాద్-విజయవాడతో పాటు అద్దంకి-నార్కట్‌పల్లి హైవేపై రద్దీ సాయంత్రం వరకు కొనసాగింది. బస్టాండ్లలో ఉదయం నుంచి మహిళలు పెద్దసంఖ్యలో కనిపించారు. -7లో

యువతా గుర్తుంచుకో.. ఓటు నమోదు చేసుకో



- నేటి నుంచి కొత్త ఓటు నమోదు, సవరణ ప్రారంభం
- ఉమ్మడి జిల్లాలో 29,39,486 మంది ఓటర్లు

నియోజకవర్గం	ఓటర్లు
దేవరకొండ	2,61,858
తుంగతుర్తి	2,57,999
మునుగోడు	2,56,065
నకిరేకల్	2,52,643
హుజూర్‌నగర్	2,50,099
నల్లగొండ	2,47,724
కోదాడ	2,45,203
సూర్యాపేట	2,42,947
ఆలేరు	2,33,860
నాగార్జునసాగర్	2,35,796
మిర్యాలగూడ	2,35,334
భువనగిరి	2,19,958
మొత్తం	29,39,486



భువనగిరి టౌన్, ఆగస్టు 19 : దేశ ప్రజాస్వామ్య స్ఫూర్తికి ఓటు హక్కు ప్రతీక. గ్రామస్థాయి నుంచి దేశం వరకు పాలనా వ్యవస్థను నిర్దేశించేది ఓటు హక్కే. ఎన్నికల్లో ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవడం ద్వారా దేశ, రాష్ట్ర గతిని మార్చే శక్తి ఓటర్లది. దీంతో అర్హులైన యువత విధిగా ఓటరుగా నమోదు కావాలని కేంద్ర ఎన్నికల సంఘం సూచిస్తోంది. ఇందుకు అనుగుణంగా ప్రతీ సంవత్సరంలో నిర్దేశించిన వ్యవధిలో ఓటు నమోదు, సవరణకు అవకాశం కల్పిస్తోంది. ఈ మేరకు 1 జనవరి 2025 నాటికి 18 ఏళ్లు నిండే వారందరూ ఓటరుగా నమోదు కావడానికి నేటి నుంచి ఎన్నికల సంఘం అవకాశం కల్పిస్తోంది. దీంతో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 19 ఏళ్లు నిండి యువత అంతా ఆన్‌లైన్‌లేదా ఆఫ్‌లైన్‌లో ఓటు నమోదుకు, ప్రస్తుత ఓటరు జాబితాలో సవరణ నేటి నుంచి అందుబాటులోకి రానుంది. గత ఓటరు జాబితా ఆధారంగా ఉమ్మడి జిల్లాలోని 12 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 29,39,486 మంది ఓటర్లు ఉన్నారు.

ఉమ్మడి జిల్లాలో 25వేల మంది అర్హులు

ఉమ్మడి జిల్లాలో నూతనంగా ఓటు నమోదుకు సుమారు 25 వేల మంది యువత అర్హులుగా ఉంటారని అధికారులు భావిస్తున్నారు. గత విద్యా సంవత్సరంలో డిగ్రీ పూర్తయిన సమాన కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులతో పాటు ఇతర రంగాల్లోని యువత 1 జనవరి 2025 నాటికి 18 ఏళ్లు నిండిన వారు ఉమ్మడి జిల్లాలో 25 వేల మందికి పైగా ఉంటారని అంచనా. అలాగే డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థుల్లో కూడా మరికొంతమంది ఓటు నమోదుకు అర్హులుగా ఉండనున్నారు. ఈ నేపథ్యంలో ఓటు నమోదుపై డిగ్రీ, ఆపై స్థాయి విద్యాసంస్థలతో పాటు ఇతర రంగాల్లోనూ అవగాహన కల్పిస్తే ఓటు నమోదు పెరిగే అవకాశం ఉంటుందని పలువురు సూచిస్తున్నారు. అయితే త్వరలో జరిగే సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ, స్థానికసంస్థల ఎన్నికలతో పాటు జనవరి 2025 నాటికి ప్రస్తుత మునిసిపల్ కౌన్సిళ్ల గడువు ముగియనుండటంతో వచ్చే ఏడాదిలో తప్పనిసరిగా ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో అర్హులైన యువతను ఓటరుగా నమోదు చేయించడంతో స్థానిక సంస్థల ఆశావాహులు ప్రత్యేక శ్రద్ధ చూపనున్నట్లు తెలుస్తోంది. అదే సమయంలో ప్రస్తుత ఓటరు జాబితాలో దొర్లిన తప్పులకు సవరణ అవకాశం కూడా ఉండటంతో ఆ దిశగా పలువురు ఓటర్లు ఓటు బదిలీ, తప్పుల సవరణకు దరఖాస్తు చేసుకునేందుకు సిద్ధమవుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో 29,39,486 మంది ఓటర్లు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 12 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. గత డిసెంబరులో జరిగిన ఎన్నికలకు ఉపయోగించిన ఓటరు జాబితా ఆధారంగా 29,39,486 మంది ఓటర్లు ఉన్నారు. అత్యధికంగా దేవరకొండ నియోజకవర్గంలో అత్యల్పంగా భువనగిరి నియోకవర్గంలో ఓటర్లు ఉన్నారు.

ఓటు నమోదు ఇలా

ఓటు నమోదు, సవరణకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ఎన్నికల సంఘం అవకాశం కల్పిస్తోంది. ఆన్‌లైన్‌లో వెబ్‌సైట్ voters.eci.gov.in ద్వారా ఓటు నమోదు, సవరణకు అవకాశం అందుబాటులో ఉంది. ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులను తమ బూత్‌లెవల్ అధికారులు(బీఎల్‌వో)కు అందించాల్సి ఉంటుంది. ఇందుకు కొత్తగా ఓటు నమోదుకు ఫారం -6, ఓటు కార్డుకు ఆధార్ నెంబర్ అనుసంధానానికి ఫారం -6(బీ), జాబితా నుంచి తొలగింపునకు ఫారం-7, తప్పు ఒప్పుల సవరణకు ఫారం-8 ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులను పూరించి సమర్పించాక బీఎల్‌వోలు క్షేత్రస్థాయి విచారణ జరిపి ఆమోదించడం లేదా తిరస్కరిస్తారు. తిరస్కరించిన దరఖాస్తులపై తిరిగి అప్పీల్ చేసుకునే అవకాశం ఉంటుంది.



రైతులకు సాగునీటిపై భరోసా కల్పించండి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ జే శ్రీనివాస్

నల్లగొండ రూరల్, ఆగస్టు 19 : నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఎడమ కాల్వ, ఏఎమ్మార్పీ లోలెవల్ కెనాల ద్వారా సాగునీటిని అన్ని గ్రామాలకు అందిస్తామన్న భరోసాను రైతులకు కలిగించాలని అదనపు కలెక్టర్ జే శ్రీనివాస్ ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో సోమవారం నిర్వహించిన సమ్మిళిత సమావేశంతో పాటు వివిధ అంశాలపై సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా పారిశుధ్య కార్యక్రమాలను నిరంతరం కొనసాగించాలని ఆదేశించారు. ఈసీజన్‌లో మూడో విడత జ్వర సర్వే నిర్వహిస్తున్నామన్నారు. ఫీవర్ సర్వేపై ఎప్పటికప్పుడు నివేదికలు అందించాలన్నారు. వన మహోత్సవం కింద నిర్దేశించిన లక్ష్యాలను ఆయా శాఖల అధికారులు పూర్తి చేయాలన్నారు. జిల్లాలోని ప్రతీ నియోజకవర్గంలోని ఉన్నత పాఠశాలను, ఆస్పత్రిని కార్పొరేట్ స్థాయిలో సేవలు అందించేలా తీర్చిదిద్దడంలో భాగంగా చేపట్టిన అంశాలపై సంబంధిత ప్రత్యేక అధికారులతో సమీక్షించారు. చేనేత, జౌళి వస్త్రాలను ప్రోత్సహించే విధంగా సోమవారం ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలు ధరించాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లాకు బదిలీపై వచ్చిన జిల్లా అధికారులను, అధికారుల సంఘం శాలువాతో సన్మానించి స్వాగతం తెలుపగా, వారికి అదనపు కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు.

'ప్రజావాణి' అర్జీలను పరిష్కరించాలి

ప్రజావాణి ఫిర్యాదులను జాప్యం చేయకుండా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రజల వద్ద నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఫిర్యాదులపై ఆయన సమీక్షించారు.

అనంతరం ఆయన అధికారులతో మాట్లాడుతూ వచ్చిన ఫిర్యాదులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ప్రజల నుంచి 22 ఫిర్యాదులను వచ్చాయన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి, డీఆర్‌డీవో వీడీ శేఖర్‌రెడ్డి, జిల్లా అన్ని శాఖల అధికారులు ఉన్నారు.

చివరి భూములకు సాగునీరు అందించాలి

అద్దంకి - నార్కట్‌పల్లి రహదారిపై రైతుల ధర్నా



మాడ్గులపల్లి మండల కేంద్రంలో రహదారిపై రాస్తారోకో నిర్వహిస్తున్న రైతులు

మాడ్గులపల్లి, ఆగస్టు 19: నాగార్జునసాగర్ వరదకాల్వ చివరి భూములకు సాగునీరు అందించాలని రైతులు డిమాండ్ చేశారు. సోమవారం ఈ మేరకు మాడ్గులపల్లి మండల కేంద్రంలోని అద్దంకి - నార్కట్‌పల్లి రహదారిపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ నాగార్జునసాగర్ జలాశయంలో నీరు పుష్కలంగా ఉన్నా వరద కాల్వ లోలెవల్ నీరు విడుదల చేస్తున్నా చివరి ఆయకట్టు తోపుచర్ల వరకు నీరు రావడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. కాల్వకు అక్రమంగా తూములు ఏర్పాటు చేయడంతో తమకు సాగునీరు అందడం లేదని ఆరోపించారు. అంతేకాక కాల్వలో కంపచెట్లు, రాళ్లు పేరుకపోవడం వల్ల నీరు కిందకు రావడం లేదని అన్నారు. చివరి ఆయకట్టు పరిధిలో ఉన్న గ్రామాలైన చెరుపల్లి, మాడ్గులపల్లి, దాచారం, ఇందుగుల, మర్రిగూడెం, తోపుచర్ల గ్రామాల్లో నీరందక, భూగర్భజలాలు లేక పంట పొలాలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే అధికారులు స్పందించి చివరి ఆయకట్టు వరకు సాగునీరందించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నీరందించని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని రైతులను ఆందోళన విరమింపచేసేందుకు ప్రయత్నించారు. ప్రభుత్వ అధికారులు స్పందించే వరకు ఆందోళన విరమించేది లేదని తేల్చిచెప్పారు. దీంతో సమాచారం తెలుసుకున్న తహసీల్దార్ పద్మ అక్కడికి చేరుకొని ఎన్నెస్పీ డీఈతో ఫోన్‌లో మాట్లాడారు. 15 రోజుల్లో చివరి భూములకు నీరందించేందుకు కృషి చేస్తామని, కాల్వపై ఉన్న తూములన్నీ మూసివేసి కిందకు ఎక్కువ నీటిని ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. రైతులు సుమారు అరగంట పాటు రాస్తారాకోతో నిర్వహించడంతో సుమారు కిలోమీటరుకు పైగా వాహనాలు నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. రాస్తారోకోలో నాయకులు, రైతులు అశోక్‌రెడ్డి, శ్రీకర్, మల్లారెడ్డి, వెంకట్‌రెడ్డి, భూపతిరెడ్డి, చారి, సుధాకర్‌రెడ్డి, అశోక్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

చెర్వుగట్టులో దర్శన 'దారి' మళ్లింపు!?

- నిత్యాన్నదాన సత్రానికి వెళ్లే మార్గంలో కొత్త క్యూలైన్
- మండప మెట్ల మార్గం వీఐపీల కోసమే
- భక్తులకు అసౌకర్యం కలుగకుండా క్యూలైన్ మళ్లింపు



కొత్త క్యూలైన్లు ఏర్పాటు చేయాలనుకుంటున్న ప్రతిపాదిత స్థలం

నార్కట్‌పల్లి, ఆగస్టు 19 : ప్రసిద్ధ శైవక్షేత్రం చెర్వుగట్టుపై దర్శన దారిలో స్వల్పమార్పులకు దేవస్థానం అధికారులు యోచిస్తున్నారు. రామలింగేశ్వరుడు వెలసిన మూలవిరాట్టును దర్శించుకునేందుకు గతంలో తూర్పు వైపు గుండా దర్శన దారి ఉండేది. అప్పటి రద్దీని బట్టి అధికారులు ఆ దారిని వినియోగించారు. కానీ కాలక్రమంలో స్వామివారి మహిమలతో క్షేత్ర ప్రాశస్త్యం పెరిగి భక్తుల సంఖ్య కూడా ఏటేటా పెరుగుతూ వస్తుండటంతో అందుకు అనుగుణంగా అధికారులు క్యూలైన్ల నిర్వహణను మారుస్తూ వస్తున్నారు. మండపాన్ని కూడా విస్తరించి మండపం లోపల నుంచే ఉచిత, ప్రత్యేక దర్శనాల క్యూలైన్లను వేర్వేరుగా కొనసాగిస్తున్నారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉన్న పర్వదినాలు, అమావాస్య వంటి ప్రత్యేకత ఉన్న రోజుల్లో మండపంలోని మూడు రౌండ్స్‌లో ఉన్న క్యూలైన్లు నిండిపోయి బయట మహామండపం మెట్ల వద్దకు క్యూలైన్ పెరిగి ఎండాకాలం, వానాకాలంలో భక్తులు ఇబ్బంది పడుతున్నారు. పైగా మండప మెట్ల వద్ద ఏటవాలుగా ఉండే బండపై గంటల తరబడి నిలబడలేక భక్తులు పడుతున్న ఇబ్బందులతో పాటు ఇదే మండప మెట్ల మీదుగా ప్రధానాలయానికి వీఐపీలు ఆలయ సందర్శనకు వచ్చే సమయంలోనూ భక్తులు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. ఈ సమస్య పరిష్కారానికి దేవస్థానం అధికారులు క్యూలైన్ల నిర్వహణలో కొద్దిపాటి మార్పులు చేయాలని భావించారు. కొత్తగా వేసే క్యూలైన్ల వద్ద షెడ్డు ఉండటంతో ప్రకృతి వైపరీత్యాల నుంచి కూడా భక్తులకు కొంత ఉపశమనం లభిస్తుందన్న అభిప్రాయాన్ని వచ్చారు. ఇకపై మహామండపం నుంచి ఉన్న మెట్ల వద్దకు ప్రత్యామ్నాయంగా నిత్యాన్నదాన సత్రానికి వెళ్లే మార్గంలోని పరశురామలింగం గుహ ఎదురుగా మండపానికి ఆనుకుని ప్రత్యేకించి మూడు వరుసలతో కూడిన ప్రత్యేక మార్గాన్ని ఏర్పాటుచేయాలని భావిస్తున్నారు. దీంతో మండప మెట్లతో నిమిత్తం లేకుండా ప్రస్తుతం మండపంలో అర్చన టికెట్లు ఇచ్చే కౌంటర్‌కు కొత్తగా ఏర్పాటు చేయదల్చిన క్యూలైన్లను అనుసంధానించనున్నారు. ఇకపై మండప మెట్ల మార్గాన్ని కేవలం వీఐపీలు, దేవస్థాన సిబ్బంది కోసమే వాడేలా చర్యలు తీసుకోనున్నారు.

కోతులు రాకుండా జాలి ఏర్పాటు

మహామండపంలో శివలింగార్చన, వేద పండితుల వేద మంత్ర పఠనం తదితర సమయాల్లో కోతులు ప్రవేశించి అసౌకర్యానికి గురిచేస్తున్నాయి. దీంతో మండపంలోనికి కోతులు రాకుండా దాతల సాయంతో కొంత మేర(మెష్) జాలితో ఫెన్సింగ్ చేశారు. మిగిలిన మండపం చుట్టూ కూడా దాతల సాయంతోనే జాలిని ఏర్పాటు చేసే పనులు కొనసాగుతున్నాయి.

ఇరుకుగా ఆంజనేయస్వామి ఆలయం



ఆంజనేయస్వామి దేవాలయంలోకి ఉన్న ఒకే దారి

చెర్వుగట్టు దేవస్థానంలో గర్భాలయం లోని మూలమూర్తిని కన్నులారా దర్శించుకునేలా ఏర్పాట్లు చేస్తున్న దేవాదాయ శాఖ అధికారులు గుట్టపై క్షేత్రపాలకుడి ఆలయంపై దృష్టి సారించడం లేదు. క్షేత్ర సందర్శనకు వచ్చే భక్తులు తొలుత గర్భాలయంలోని రామలింగేశ్వరుని దర్శనం అనంతరం ఉత్తరద్వారం ద్వారా బయటకు వస్తారు. వెంటనే తూర్పు వైపున ఉండే క్షేత్రపాలకుడు ఆంజనేయ స్వామిని దర్శనానికి వెళ్తుంటారు. గుహలో బండరాళ్లు అడ్డుగా ఉండటం పైగా స్వామివారి గర్భాలయ ద్వారం చిన్నదిగా ఉండటంతో స్వామివారిని దర్శించుకోవడం భక్తులకు అసౌకర్యంగా మారిన పరిస్థితులను గుర్తించిన దేవస్థానం అధికారులు శైవాగమ శాస్త్రం ప్రకారం బండ రాతి పొరలను తొలగించడంతో పాటు స్వామివారి గర్భాలయ ద్వారాన్ని విస్తరణ పనులను చేపట్టగా దాదాపు పూర్తయ్యే దశకు చేరుకున్నాయి. కానీ అదే సమయంలో అంతే ఇరుకుగా ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో అసౌకర్యంగా దర్శనం చేసుకుంటున్న పరిస్థితిని గుర్తించడం లేదంటూ భక్తులు పెదవి విరుస్తున్నారు. పండుగ రోజులు, పర్వదినాలు, అమావాస్య, పౌర్ణమి, సోమవారం, శుక్రవారం వంటి రద్దీ ఉండే రోజుల్లో ఆంజనేయస్వామిని దర్శించుకోవడం భక్తులకు ఇబ్బందిగా మారింది. ఇద్దరు లోనికి వెళితే వారు అదే దారిలో బయటకి వస్తే కాని మరో ఇద్దరు లోపలికి వెళ్లి స్వామిని కన్నులారా దర్శించలేని పరిస్థితి. తోసుకుని వెళ్లలేక కొందరు భక్తులు ఆలయం బయట నుంచే స్వామిని చూసి ప్రదక్షిణ చేయడంతో మమ అనిపిస్తున్నారు.

ఉత్తర ద్వారం ఉన్నా

ఐతే ఆలయానికి పశ్చిమ ద్వారంతో పాటు ఉత్తర ద్వారం కూడా ఉంది. కారణమేమిటో తెలియదు కాని ఉత్తర ద్వారం (జాలి) తలుపులు ఎప్పుడూ తాళం వేసే ఉంటాయి. కానీ ఒకే ద్వారం గుండా ఇరుకైన చోటికి ప్రవేశించి అదే ద్వారం గుండా నిష్క్రమించే సమయంలోనే ఒకరినొకరు తోసుకుంటుండటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఉత్తర ద్వారం తెరిచి ఉంచితే స్వామి దర్శనం అనంతరం భక్తులు ఆ ద్వారం గుండా నిష్క్రమిస్తే ఇబ్బంది ఉండదు.

చెర్వుగట్టుపై ఘనంగా మాస కల్యాణం



చెర్వుగట్టులో మాస కల్యాణం తంతు నిర్వహిస్తున్న అర్చక స్వాములు

చెర్వుగట్టు రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం మాస కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ మహామంటపంలో నిర్వహించిన ఈ వేడుకకు ముందు పార్వతీ పరమేశ్వరుల ఉత్సవమూర్తులను ప్రధానాలయం నుంచి మంగళవాయిద్యాల మధ్య తీసుకువచ్చి ఆసీనులను చేయించారు. అనంతరం ఆలయ ప్రధానార్చకుడు పోతులపాటి రామలింగేశ్వరశర్మ, సురేశ్‌శర్మ శైవగామోక్త ప్రకారంగా పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవాన్ని భక్తుల శివన్నామస్మరణల మధ్య వైభవంగా నిర్వహించారు.

గోపలాయపల్లిలో: హరిహరక్షేత్రంగా భాసిల్లుతున్న గోపలాయపల్లి క్షేత్రంలోనూ వారిజాల వేణుగోపాలస్వామి దేవస్థానంలో పౌర్ణమి తిథిని పురస్కరించుకుని మాసకల్యాణ వేడుకను నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది.

ఆర్టీసీ బస్సులు నిల్చొని వెళ్లడానికి కూడా చోటు లేనంతగా ప్రయాణికులతో కిక్కిరిసి వెళ్తున్నాయి. తీరా డిపోకు వెళ్లాక క్యాష్ కౌంటర్‌లో డబ్బులు డిపాజిట్ చేసేందుకు కండక్టర్ బ్యాగ్ తెరిస్తే ఆశించినంత ఆదాయం ఉండటం లేదు. ఆర్టీసీ బస్సుల్లో జారీచేస్తోన్న జీరో టికెట్లతో బస్సులు ఫుల్... కలెక్షన్ డల్ అన్న చందంగా తయారైంది. దీంతో ఆదాయ పెంపు మార్గాలపై యాజమాన్యం దృష్టి సారిస్తోందని తెలుస్తోంది.

- మోత్కూరు

ఆర్టీసీలో మళ్లీ మొదలైన టార్గెట్లు?



- బస్సులు ఫుల్, కలెక్షన్ డల్
- ఆదాయం పెంచేందుకు ఆర్టీసీ యాజమాన్యం చర్యలు
- బస్సుల్లో పురుష ప్రయాణికులు ఎక్కువ ఉండేలా చూడాలంటున్న అధికారులు
- ఎలా సాధ్యమంటున్న కండక్టర్లు

చర్చ
CHARCHA

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోగాని, తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయ్యాక బీఆర్ఎస్ ప్రభుత్వంలో గాని ప్రతీ రూట్‌లో నడిచే ఆర్టీసీ బస్సుకు కలెక్షన్ టార్గెట్ నిర్ణయించేవారు. టార్గెట్‌కు మించి డబ్బులు తెచ్చిన బస్సు డ్రైవర్, కండక్టర్‌కు ప్రోత్సాహకంగా ఇన్సెంటివ్ ఇచ్చేవారు. టార్గెట్ తీసుకరాని వారిని మందలించేవారు. టార్గెట్ రావడం లేదని కొన్ని రూట్లలో బస్సులు కూడా రద్దు చేసి ఆదాయం వచ్చే రూట్లకు మళ్లించారు. గత డిసెంబరులో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుతీరాక సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మహాలక్ష్మి పథకంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపైనే తొలిసంతకం చేసి అమలుచేస్తున్నారు. ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో బస్సులు ఫుల్ ఆక్యుపెన్సీతో (ఎక్కువ మంది ప్రయాణికులతో) నడుస్తున్నాయి. దీంతో ఆర్టీసీ యాజమాన్యం సిబ్బంది కలెక్షన్ టార్గెట్ నిలిపివేశారు. మహిళలకు ఇస్తున్న జీరో టికెట్ల ప్రభావంతో డిపోలో కండక్టర్లు డిపాజిట్ చేస్తున్న నగదు తగ్గిపోగా, ప్రభుత్వం మహిళల ఉచిత ప్రయాణానికి సంబంధించిన డబ్బు చెల్లించకపోవడంతో సిబ్బంది వేతనాల చెల్లింపు, బస్సుల నిర్వహణ కష్టతరంగా మారిందని తెలుస్తోంది. వేతనాలు, నిర్వహణ ఖర్చుల కోసం అప్పులకు వెళ్తున్న ఆర్టీసీ యాజమాన్యం తమ ఆదాయాన్ని పెంచుకోవడానికి ఈ నెల ప్రారంభం నుంచి బస్సులకు కలెక్షన్ టార్గెట్లు ఫిక్స్ చేసిందంటున్నారు. ఈ మేరకు బస్సుల్లో పురుషులను ఎక్కువగా ఎక్కించుకోవాలని ఉన్నతాధికారులు కండక్టర్లకు, డ్రైవర్లకు మౌఖికంగా ఆదేశాలిచ్చినట్లు చెబుతున్నారు. అయితే అధికారుల ముందు ఏమీ మాట్లాడని కండక్టర్లు, డ్రైవర్లు బయటకు వచ్చాక అది ఎలా సాధ్యమని స్థానికంగా చర్చించుకుంటున్నట్లు తెలుస్తోంది. బస్సు స్టేజీ మీదనో, బస్టాండులోనో ఆగగానే మహిళా ప్రయాణికులే నిండిపోతున్నారని, వారిని తగ్గించి తాము పురుషులను ఎక్కువగా ఎలా ఎక్కించగలుగుతామని కండక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బస్సు స్టాండింగ్ ప్యాసింజర్లతో వెళ్తున్నప్పుడు స్టేజీల వద్ద బస్సు ఆపినా పురుషులు ఎక్కడం లేదంటున్నారు. యాదగిరిగుట్ట నుంచి ఉప్పల్ క్రాస్‌రోడ్డు వరకు రోజుకు మూడు ట్రిప్పులు వేసే బస్సుకు రూ.13,800 నగదు టార్గెట్ నిర్ణయించి ఎస్ఆర్‌పై రాశారని ఓ కండక్టర్ తెలిపారు. జీరో టికెట్లు మినహాయించి ఆ బస్సుకు రోజుకు రూ.8వేలు, 9వేలే వస్తాయన్నారు. నల్లగొండ నుంచి మోత్కూరు రోజుకు మూడు ట్రిప్పులు నడిచే బస్సుకు రూ.12వేలు టార్గెట్ పెడుతున్నారని మరో కండక్టర్ తెలిపారు. మహిళల టికెట్లు మినహాయించి రోజుకు రూ.ఆరేడు వేల కలెక్షన్ మాత్రమే వస్తుందన్నారు. ఇదిలా ఉండగా డీలక్స్, సూపర్‌లగ్జరీ బస్సుల్లో మహిళా ప్రయాణికులను ఆకర్షించడానికి లక్కీడిప్ బాక్స్‌లు ఏర్పాటు చేస్తున్నారు. మహిళా ప్రయాణికులు బస్సు దిగిపోయేటప్పుడు వారి టికెట్‌పై పేరు, సెల్ నంబరురాసి ఆ బాక్స్‌లో వేస్తే, డ్రా తీసి బహుమతులు అందజేస్తామంటున్నారు. అయినా మహిళా ప్రయాణికులు సీట్లు దొరక్కపోయినా ఉచిత ప్రయాణ బస్సులోనే వెళ్తున్నారు. సీజన్, అన్‌సీజన్ అనేది లేకుండా ఆర్టీసీ బస్సులు మహిళా ప్రయాణికులతో నిండి వెళ్తున్నాయి.

దీంతో తాము టార్గెట్లు ఎలా తేగలుగుతామని ఆర్టీసీ సిబ్బంది ప్రశ్నిస్తున్నారు. టార్గెట్లు జీరో టికెట్లతో కలిపి నిర్ణయించాలని, అదికూడా గతంలో కన్నా కొంచెం పెంచితే పర్వాలేదు కానీ గతంలో రూ.12 వేలు ఉన్న టార్గెట్‌ను ఇప్పుడు రూ.22 వేలకు పెంచారని, అది సమంజసం కాదని ఆర్టీసీ కండక్టర్లు, డ్రైవర్లు అంటున్నారు.

ఇతర మార్గాల వైపు పురుష ప్రయాణికులు

మహాలక్ష్మి పథకంలో భాగంగా ఉచిత ప్రయాణం వైపే మహిళలు ఆసక్తి చూపిస్తుండటంతో బస్సులన్నీ రద్దీగా వెళ్తున్నాయి. ఈ క్రమంలో పురుష ప్రయాణికులు ఆ రద్దీలో వెళ్లలేక లగ్జరీ, సూపర్ లగ్జరీ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. ఇవి లభ్యం కాని ప్రాంతాల్లో ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణానికి ఆసక్తి చూపిస్తున్నారు. గతంలో మహిళలు, పురుషులతో వచ్చే ఆదాయమే మహిళలు తక్కువ అయినప్పటికీ పురుషులు పెరగడంతో లగ్జరీ, సూపర్ లగ్జరీల్లో రోజువారీ ఆదాయం ఏ మాత్రం తగ్గలేదంటున్నారు. ఆర్టీసీ ఉన్నతాధికారులు టార్గెట్ల విషయంలో మినహాయింపు ఇవ్వాలని కండక్టర్లు, డ్రైవర్లు కోరుతున్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



సుధాకర్ (ఫైల్ ఫొటో)

నాగార్జునసాగర్, ఆగస్టు 19: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ డివిజన్ అటవీ ప్రాంతంలో నెల్లికల్ బీట్‌లో జరిగింది. సాగర్ ఎస్ఐ సంపత్ తెలిపిన వివరాల ప్రకారం... నెల్లికల్ బీట్‌లో వినాయక దేవాలయం వెనుక పగడాల సుధాకర్ (38) అనే వ్యక్తి చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వేములపల్లి మండలం శెట్టిపాలెం గ్రామానికి చెందిన సు ధాకర్ మిర్యాలగూడ పట్టణంలోని శాంతినగర్‌లో కుటుంబసభ్యులతో నివాసం ఉంటున్నారు. మృతుడు సుధాకర్ ఇటాచీ క్యాష్ మేనేజ్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్‌లో క్యాష్ డిపాజిటర్‌గా ఉద్యోగం చేస్తున్నట్లు తెలిసింది. ఈ నెల 13వ తేదీన ఏటీఎంలో క్యాష్ డిపాజిట్ చేసే క్రమంలో రూ. 20లక్షలతో ఉడాయించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ ఘటనపై మిర్యాలగూడ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైనట్లు తెలిసింది. సోమవారం మృతదేహాన్ని గమనించిన పశువుల కాపరులు పోలీసులకు తెలియజేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సాగర్ కమలానెహ్రూ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడు సుధాకర్‌కు భార్య రత్నకుమారి, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ సంపత్ తెలిపారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య



బాలు మృతదేహం

త్రిపురారం, ఆగస్టు 19: మద్యానికి బానిసైన వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నా డు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా త్రిపురారం మండలంలో జరిగింది. ఎస్ఐ వీరశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం... నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలం పుల్లగిరి గ్రామానికి చెందిన మూడవత్ బాలు (43) మద్యానికి బానిసై 20 సంవత్సరాలుగా మతిస్థిమితం లేకుండా తిరుగుతున్నాడు. ఆయనకు ఇద్దరు భార్యలు ఉండగా నలుగురు పిల్లలు ఉన్నారు. ఎన్నిచోట్ల వైద్యం చేయించుకున్నా ప్రయోజనం లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో నల్లగొండ జిల్లా త్రిపురారం మండలం సీత్యాతండాలోని ఆంజనేయస్వామి దేవాలయానికిపూజ నిమిత్తం ఆదివారం మొదటి భార్యతో కలిసివచ్చాడు. రాత్రి పది గంటల సమయంలో బాలు మూత్ర విసర్జన కోసం బయటకు వెళ్లాడు. ఎంత సేపటికి రాకపోవడంతో భార్య వెతికింది. గుడి ఆవరణలోని చెట్టుకు లుంగీతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుని కనిపించాడు. మృతుడు బాలుకు ఇద్దరు భార్యలు కాగా మొదటి భార్యకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు, రెండో భార్యకు కుమార్తె ఉన్నారు. మొదటి భార్య తారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వీరశేఖర్ తెలిపారు.

అనారోగ్య సమస్యలతో బలవన్మరణం



వెంకట్‌రెడ్డి మృతదేహం

భూదాన్‌పోచంపల్లి, ఆగస్టు 19: అనారోగ్య సమస్యలు తట్టుకోలేక ఓ వ్యక్తి క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలం శివారెడ్డిగూడెం గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని శివారెడ్డిగూడెం గ్రామానికి చెందిన వారాల వెంకట్‌రెడ్డి (55) అనే వ్యక్తి ఇటీవల తరుచూ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆదివారం అతడు వైద్య పరీక్షలు నిర్వహించుకున్నాడు. షుగర్ లెవల్ పెరగడంతో వ్యాధి మరింత పెరుగుతుందని మనస్తాపంతో ఉన్నాడు. సోమవారం ఉదయం ఐదు గంటలకు లేచి ఇంటి నుంచి పొలం వద్దకు వెళ్లాడు. అక్కడ క్రిమిసంహారక మందు తాగాడు. పక్క పొలానికి చెందిన వ్యక్తి అపస్మారక స్థితిలో ఉన్న వెంకట్‌రెడ్డిని చూసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. అక్కడికి చేరుకున్న కుటుంబ సభ్యులు పరిశీలించగా అప్పటికే మృతి చెందాడు. పోలీసులకు సమాచారం అందించగా ఎస్ఐ భాస్కర్‌రెడ్డి కేసు నమోదు చేసుకుని పంచనామా నిర్వహించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడు వెంకట్‌రెడ్డికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

దర్వేశిపురం ఎల్లమ్మకు శ్రావణ బోనాలు



ఎల్లమ్మ ఆలయంలో భక్తుల పూజలు

కనగల్, ఆగస్టు 19: నల్లగొండ జిల్లా కనగల్ మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయానికి శ్రావణమాసం రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని సోమవారం భక్తుల రద్దీ కొనసాగింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ఆలయ ప్రదక్షిణలు చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. పలువురు భక్తులు బోనాలను నైవేద్యాలుగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ సిబ్బంది తగు ఏర్పాట్లు చేశారు.

భగీరథ నీళ్లు నేటికీ బిందెడు రాలే



భగీరథ నీళ్లు రావట్లేదని పైపు చూపిస్తున్న మహిళ

- పథకం ప్రారంభమై నాలుగేళ్లయినా ఇదే పరిస్థితి
- సుమారు 250 ఇండ్లకు నేటికి అందని సురక్షిత నీళ్లు
- సంబంధిత అధికారులకు చెప్పినా ఫలితం శూన్యం
- తిరుమలగిరి మండల కేంద్రం ఎస్సీ కాలనీవాసుల ఆవేదన

తిరుమలగిరి(సాగర్), ఆగస్టు 19: ఇంటింటికీ శుద్ధి చేసిన రక్షిత తాగునీటిని అందించే మిషన్ భగీరథ పథకం మండల కేంద్రంలో ప్రారంభమై నేటికి సుమారు నాలుగేళ్లు అవుతుంది. కానీ తిరుమలగిరి (సాగర్) మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో రక్షిత మంచినీరు నేటికీ కనీసం బిందెడు కూడా రాలేదని కాలనీవాసులు ఆవేదన చెందుతున్నారు. అధికారులు మా ఇళ్ల ముందు చిన్న పైపులైన్ వేసి పలు ఇళ్లల్లో నీటి కుళాయిలు కూడా అమర్చకుండా నామమాత్రంగా పనులు చేశారని గ్రామస్థులు వాపోతున్నారు. ఈ సమస్య గురించి పలుమార్లు మిషన్ భగీరథ ఇంజనీర్లు, స్థానిక ప్రజాప్రతినిధులకు తెలియజేసినా పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శిస్తున్నారు. దీంతో గత్యంతరం లేక ఎప్పటిలాగా గ్రామ శివారులో ఉన్న బావి నుంచి వచ్చే నీళ్లనే తాగడానికి వినియోగిస్తున్నట్లు వారు తెలుపుతున్నారు. కొందరైతే స్థానికంగా ఉన్న వాటర్ ప్లాంట్ల వద్ద నీటిని కొనుగోలు చేసి క్యాన్లలో తెచ్చుకుంటున్నారు. మండల కేంద్రంలోనే ఇలా ఉంటే మారుమూల గ్రామాల్లో, తండాల్లో పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.

అసంపూర్తిగా పనులు చేసినట్లు ఆరోపణలు

మిషన్ భగీరథ పథకంలో భాగంగా ఆయా గ్రామాల్లో ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకుల నిర్మాణం, నీటి నిల్వ చేసే సామర్థ్యాన్ని బట్టి గ్రామంలో నీటిని పంపిణీ చేసేందుకు మొదట్లో సుమారు 6 ఇంచుల పైపులను చివరికి వచ్చే సరికి సుమారు 2 ఇంచుల వరకు వీధుల్లో అమర్చారు. ఆ పైపులైన్లకే ఇంటింటికీ నీటిని అందించడానికి ఆఫ్ ఇంచు పైపులైన్లతో కనెక్షన్లు ఇవ్వాలి. దీంతో పాటు ఇంటి లోపల భాగంలో నీటిని పట్టుకోవడానికి వీలుగా కుళాయిలను సైతం ఏర్పాటు చేసేందుకు కాంట్రాక్టర్లు పనులను దక్కించుకున్నారు. అయితే స్థానిక ఎస్సీ కాలనీలో వారి ఇంటి ముందు నుంచి వెళ్లే మెయిన్ పైపులైన్ నుంచి కనెక్షన్ మాత్రమే ఇచ్చారని, పలువురి ఇళ్లకు నీటి కుళాయిలను కూడా బిగించకుండా అసంపూర్తిగా పనులు చేశారని స్థానికులు ఆరోపణలు చేస్తున్నారు. గ్రామంలో పలుచోట్ల ఇళ్ల ముందు వీధుల్లోనే పైపులైన్ నుంచి ఇచ్చిన కనెక్షన్లతో బోసిపోతున్న పరిస్థితి ఉంది.

మా ఇళ్లకు భగీరథ నీళ్లు రావట్లేదు



మా కాలనీకి సుమారు నాలుగేళ్లయినా భగీరథ నీరు రావడం లేదు. దీనిపై అధికారులు తగిన చర్యలు తీసుకోని ఇంటింటికి నీళ్లు వచ్చేలా చూడాలి.

- సైదమ్మ, ఎస్సీ కాలనీ, తిరుమలగిరి, సాగర్

సమస్యను పరిష్కరిస్తాం

స్థానిక కాలనీలో భగీరథ నీళ్లు రావడం లేదని మా దృష్టికి వచ్చింది. ఈ సమస్యను పరిష్కరించేందుకు నూతనంగా 90 వేల లీటర్ల ఓహెచ్ఎస్ఆర్ ట్యాంక్ గ్రామంలో నిర్మిస్తున్నాం. ఆ పనులు పూర్తయిన తర్వాత కాలనీవాసులకు నీటి సరఫరా సక్రమంగా అందేలా చూస్తాం.

- ప్రదీప్‌రెడ్డి, మిషన్ భగీరథ, ఏఈఈ



● పర్యవేక్షణలో మిషన్ భగీరథ అధికారుల నిర్లక్ష్యం

గ్రామాల్లో రక్షిత మంచినీటి సరఫరాను సక్రమంగా అందించేందుకు చేపట్టిన పనులను పర్యవేక్షించడంలో సంబంధిత మిషన్ భగీరథ ఇంజనీర్ల పర్యవేక్షణ లోపం కొట్టొచ్చినట్లు కనపడుతుంది. గ్రామంలో కాంట్రాక్టర్ చేసే పనులను పర్యవేక్షించకపోవడం వల్లే ఈ సమస్య తలెత్తిందని స్థానికులు విమర్శిస్తున్నారు. ఈ సమస్యపై పలుమార్లు సంబంధిత ఇంజనీర్లకు తెలియచేసినా వారు పట్టించుకున్న దాఖలాలు లేవని వారు పేర్కొంటున్నారు.

గోపాలమిత్రలకు కనీస వేతనం అమలుచేయాలి

- గోపాలమిత్రల అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చెరుకు శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న చెరుకు శ్రీనివాస్

నాగార్జునసాగర్, ఆగస్టు 19: రాష్ట్రంలో పశు సంవర్థక శాఖలో పనిచేస్తున్న 1534 మంది గోపాల మిత్రలకు కనీస వేతనం రూ.24 వేలు అమలుచేయాలని గోపాలమిత్రల అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షులు చెరుకు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. పెద్దవూర మండలకేంద్రంలో సోమవారం నిర్వహించిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా పశుసంవర్థక శాఖలో పనిచేస్తున్న గోపాలమిత్రలను మండల పశువైద్యాధికారి పరిధిలోకి తీసుకురావాలని అన్నారు. బస్సుసౌకర్యం లేని పల్లెలు, తండాల్లోని రైతుల వద్దకు గోపాలమిత్రలు వారి పశువులకు కృత్రిమ గర్భధారణ సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. అధిక పాల దిగుబడి ఇచ్చేందుకు మేలు జాతి దూడలను పుట్టిస్తూ గోపాలమిత్రలు ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. రైతులకు ఎన్నో సేవలందిస్తున్న గోపాలమిత్రలకు కనీస వేతనం ఇవ్వకపోవడం బాధాకరమని అన్నారు. రిటైర్డ్‌మెంట్ వయస్సును 61 సంవత్సరాలకు పెంచాలని అన్నారు. అలాగే ఉద్యోగ భద్రతను కల్పించాలని కోరారు. విధి నిర్వహణలో చనిపోయిన గోపాలమిత్రల కుటుంబాలకు ప్రభుత్వం అందించే ఆర్థిక సాయం రూ.6లక్షలకు పెంచాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి దోమల ముత్తయ్య, నాయకులు యాదయ్య, శంభులింగం, లింగారెడ్డి, లింగయ్య, మల్లేశం, నర్సింహ వివిధ మండలాల గోపాలమిత్రలు తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

- ముగ్గురికి తీవ్ర గాయాలు

కోదాడ, చిట్యాల రూరల్, ఆగస్టు 19: వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందగా, ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ప్రమాదాలు సూర్యాపేట జిల్లా కోదాడ మండలం, నల్లగొండ జిల్లా చిట్యాల మండలాల్లో ఆదివారం జరిగాయి.

కోదాడ ఎస్ఐ రంజిత్ తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడకు చెందిన వ్యాపారి గునుగుంట్ల రామకృష్ణ (48) ఆదివారం రాత్రి మెడికల్ షాపులో మందులు కొనుగోలు చేసి గోల్డ్ షాపుల చౌరస్తాలో బైక్‌పై రోడ్డు దాటుతున్నాడు. కట్టకొమ్ముగూడెం రోడ్డు నుంచి కోదాడకు ద్విచక్ర వాహనంపై ట్రిబుల్ రైడింగ్‌తో వస్తున్న నల్లాని మురళి, గూడెపు నవీన్, దాసోజు శ్రీను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో రామకృష్ణ అక్కడికక్కడే మృతి చెందగా, మురళి, నవీన్, శ్రీను తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన ఈ ముగ్గురిని చికిత్స నిమిత్తం పోలీసులు ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. రామకృష్ణ మృతదేహాన్ని కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. రామకృష్ణ భార్య సావిత్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

● చిట్యాల ఏఎస్ఐ జానారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పేరేపల్లికి చెందిన రూపని రాజశేఖర్ (31) ఎక్స్‌కవేటర్ డ్రైవర్‌గా పని చేస్తుంటాడు. ఈ నెల 18వ తేదీన రాత్రి చిట్యాల మండలం వెలిమినేడులో విధులు ముగియడంతో తన ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి వెళ్తుండగా అర్ధరాత్రి సమయంలో పేరేపల్లి గ్రామశివారులో అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టాడు. దీంతో రాజశేఖర్ తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి సోదరుడు రాము ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.



భూదాన్‌పోచంపల్లి మండలం దేశ్‌ముఖి గ్రామశివారులోని విజ్ఞాన్ వర్సిటీలోని ఓరియెంటేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య

లక్ష్య సాధనకు నిరంతరం కృషిచేయాలి

- విజ్ఞాన్ సంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య

భూదాన్‌పోచంపల్లి, ఆగస్టు 19: ఎంచుకున్న లక్ష్యాలను సాధించేందుకు విద్యార్థులు నిరంతరం కృషి చేయాలని విజ్ఞాన్ సంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్త య్య అన్నారు. యాదాద్రిభువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలం దేశ్‌ముఖి గ్రామశివారులోని విజ్ఞాన్ యూనివర్సిటీలో సోమవారం బీటెక్ మొదటి సంవత్సరం ఓరియెంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీమ్డ్ యూనివర్సిటీ నిర్మాణం, పాఠ్యాంశాలు, సానుకూల అభివృద్ధి, ఇబ్బందులను అధిగమించేందుకు విద్యార్థులు సానుకూల దృక్పథాన్ని అలవర్చుకోవాలని సూచించారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి పూనం మాలకొండయ్య మాట్లాడుతూ గ్రాడ్యుయేట్ల పాత్ర, వారి బాధ్యతలతోపాటు సమాజంలో వారి పాత్ర గురించి వివరించారు. విజ్ఞాన్ వర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ పీ నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎం.ఎస్ రఘునాథన్ మాట్లాడుతూ విద్యార్థులకు కెరీర్ అవకాశాలను వివరించారు. ఏపీలోని నర్సారావుపేట నియోజకవర్గం పార్లమెంట్ సభ్యుడు, విశ్వవిద్యాలయం వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు విశ్వవిద్యాలయంలో కల్పిస్తున్న సౌకర్యాలు, పోటీ ప్రపంచంలో విద్యార్థుల పాత్ర, వారి లక్ష్యాలను చేరుకోవడానికి వారి సన్నద్ధతపై మార్గదర్శనం చేశారు. విజ్ఞాన్ స్కూల్స్ వైస్ చైర్‌పర్సన్ రాణి రుద్రమదేవి విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో విజ్ఞాన్ సంస్థల సీఈవో బోయపాటి శ్రావణ్, డీన్స్ డాక్టర్ విజయకృష్ణ, తాత్కాలిక డైరెక్టర్ డాక్టర్ సుబ్బారావు, డీన్ డాక్టర్ రుక్మిణి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్ అనిల్‌కుమార్, డాక్టర్ సునీల్, డాక్టర్ సయ్యద్, డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ సురేష్‌చంద్ర, డాక్టర్ వేణు, డాక్టర్ నవీన్, డాక్టర్ శివకుమార్, డాక్టర్ హిమామ్, డాక్టర్ హేమలత, డాక్టర్ అమీనా, డీన్లు డాక్టర్ గౌరీశంకర్, డాక్టర్ మురళి పాల్గొన్నారు.



హాజరైన విద్యార్థులు, తల్లిదండ్రులు



చౌటుప్పల్‌లో బస్సు ఎక్కుతున్న మహిళలు



నల్లగొండలో బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు



కిటకిటలాడుతున్న చౌటుప్పల్ బస్టాండ్

కిటకిటలాడిన బస్టాండ్లు

నల్లగొండ, నార్కట్‌పల్లి, చౌటుప్పల్ టౌన్, అర్వపల్లి, ఆగస్టు 19: రాఖీ పండుగ ఉండడంతో సోమవారం ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ఆర్టీసీ బస్టాండ్లు కిటకిటలాడాయి. తమ సోదరులకు రాఖీ కట్టడం కోసం సోదరీమణులు తమ సొంత వాహనాలతో పాటు ఆర్టీసీ బస్సులోను పెద్ద ఎత్తున ప్రయణించారు. మహాలక్ష్మి పథకం మూలంగా ఉచిత బస్సు ప్రయాణాన్ని మహిళ లు పెద్ద ఎత్తున సద్వినియోగం చేసుకోన్నారు. ఆర్టీసీ అధికారులు సైతం గ్రామాలకు, పట్టణాలకు బస్సులను నడిపించా రు.మహిళా ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండటంకోసం ఆర్టీసీ అధికారులు బస్సు సౌకర్యం కల్పించారు. రీజియన్ పరిధిలోని అన్ని డిపోల పరిధిలో ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా బస్సులను సమకూర్చగలిగారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలోని 65వ నంబరు జాతీయ రహదారిపై సోమవారం వాహనాల రద్దీ నెలకొంది. వరుస సెలవుల నేపథ్యంలో ఈనెల 14నుంచి 17వతేదీ వరకు హైదరాబాద్ నుంచి ఏపీలోని స్వగ్రామాలకు వెళ్లిన ప్రజలు సోమవారం సాయంత్రం నుంచి తిరుగు ప యనమయ్యారు. హైదరాబాద్‌నుంచి విజయవాడ వైపు వెళ్లే రోడ్డు సైతం వాహనాలతో రద్దీగా మారింది. పట్టణంలోని హైవే పైన ఉన్న మూడు జంక్షన్లవద్ద వాహనాలను క్రమబద్ధీకరించి పంపిస్తున్నారు.



అర్వపల్లిలో కిక్కిరిసిన బస్సు ఎక్కుతున్న మహిళలు



నార్కట్‌పల్లి బస్టాండ్‌లో రద్దీ

రేపటి కోసం పర్యావరణాన్ని కాపాడుదాం

● ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ, ఆగస్టు 19: మన కలలు నెరవేర్చే రేపటితరం కోసం పర్యావరణాన్ని కాపాడుకోవాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం 'నేను నా మిర్యాలగూడ' కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న వనమహోత్సవం కార్యక్రమం సూర్య తేజ రైస్‌మిల్లు ఆధ్వర్యంలో నిర్వహించారు. మిల్లు ఆవరణలో 250 మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీఎల్ఆర్ మాట్లాడుతూ మన పూర్వీకులు నాటిన మొక్కలు పుష్పించి పండ్లు, స్వచ్ఛగాలి, నీడను మనకు అందిస్తున్నాయని అన్నారు. అలాగే మనం నాటి రక్షించిన మొక్కలు మన వారసులకు ఉపయోగపడాలన్నారు. పెరుగుతున్న అభివృద్ధితో పాటు పర్యావరణానికి సంభవించే ముప్పును అరికట్టాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. రైస్‌మిల్లర్స్ అసోసియేషన్‌తో పాటు స్వచ్ఛంద సంస్థలు కూడా మొక్కలు నాటే కార్యక్రమాన్ని కొనసాగించాలని అన్నారు. కార్యక్రమంలో మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరు శ్రీనివాస్, నాయకులు కర్నాటి రమేష్, బాబ్జి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, బీఎల్ఆర్ బ్రదర్స్ తదితరులు పాల్గొన్నారు.

భారత్‌బంద్‌ను విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న ఎస్సీ, ఎస్టీ సంఘాల నేతలు

మిర్యాలగూడ, మునుగోడు, ఆగస్టు 19: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ, క్రిమిలేయర్‌కు వ్యతిరేకంగా ఈ నెల 21న తలపెట్టిన భారత్‌బంద్‌ను విజయవంతం చేయాలని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు తాళ్లపల్లి రవి, బంజారా ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ దశరథ్‌నాయక్, సామాజిక వేత్త జాడి రాజు, గిరిజన ఉద్యోగుల సంఘం నాయకుడు తిరుపతి కోరారు. సోమవారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగానికి వ్యతిరేకమన్నారు. కులాల, వర్గాల మధ్య చిచ్చు పెట్టేందుకే వర్గీకరణకు పాల్పడ్డారని ఆరోపించారు. ఈ విషయంలో సుప్రీం కోర్టు తీర్పును వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 21వ తేదీన జరిగే భారత్‌బంద్‌లో ఎస్సీ, ఎస్టీ విద్యార్థి, ఉద్యోగ, మహిళా సంఘాల సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని బంద్‌ను విజయవంతం చేయాలన్నారు. వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల యాజమాన్యాలు మద్దతు పలికి బంద్‌కు సహకరించాలని కోరారు. సమావేశంలో ఎరుకల హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు వజ్జగిరి అంజయ్య, టీజీయూఏస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణకాంత్‌నాయక్, ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు సైదానాయక్, మాలమహానాడు సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనర్ జోసెఫ్, విద్యార్థి సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● ఎస్సీ వర్గీకరణ వ్యతిరేకిస్తూ ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో ఈ నెల 21వ తేదీన నిర్వహించనున్న మాలల భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని మాలమహానాడు జాతీయ స్టీరింగ్ కమిటీ సభ్యుడు గోలి సైదులు పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు యాదగిరి, బాల శివరాజు, చలిచీమల యాదగిరి, ఎన్నమల్ల వంకటేష్, దశరథ, వెంకట్ పాల్గొన్నారు.

డ్రగ్స్, గంజాయి లేని సమాజం ఏర్పాటు కావాలి

● ఏఎస్పీ రాములు నాయక్


చిన్నారులకు భోజనం వడ్డిస్తున్న ఏఎస్పీ రాములునాయక్

నల్లగొండ, ఆగస్టు 19: జిల్లాను డ్రగ్స్, గంజాయి లేని సమాజం ఏర్పాటు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఏఎస్పీ రాములునాయక్ అన్నారు. సోమవారం పట్టణంలోని చారుమతి చైల్డ్ కేర్ సెంటర్‌లో జగిని టెక్స్‌టైల్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్షాబంధన్, అన్నదాన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. చిన్నారులకు చక్కటి భవిష్యత్తు అందిస్తున్న చారుమతి చైల్డ్ కేర్ సెంటర్ సేవలను కొనియాడారు. అనంతరం రాఖీలను కట్టి శుభాకాంక్షలు తెలిపారు. చిన్నారులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో జగిని టెక్స్‌టైల్ యజమాని వెంకన్న, చైల్డ్‌కేర్ సెంటర్ వ్యవస్థాపకులు శ్యామల నాగసేనారెడ్డి, మేనేజర్ శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

యాద్గార్‌పల్లి చెన్నకేశవ ఆలయంలో చోరీ


చోరీకి గురైన వెండి కన్ను

మిర్యాలగూడ అర్బన్, ఆగస్టు 19: పురాతన చెన్నకేశవ ఆలయంలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఈ సంఘటన మిర్యాలగూడ మండలం యాద్గార్‌పల్లి గ్రామంలో జరిగింది. పోలీసులు, ఆలయ పూజారి తెలిపిన వివరాల ప్రకారం.. స్వామివారికి నిత్యపూజ చేసేందుకు సోమవారం ఉదయం పూజారి మనీష్‌గౌతమ్ ఆలయంలోకి ప్రవేశించారు. ఆలయ ముఖద్వారం తలుపు తెరుచుకొని వస్తువులు చిందరవందరగా పడి ఉండటాన్ని గమనించి స్థానికులకు సమాచారం ఇచ్చాడు. దేవాలయ కమిటీ సభ్యులు పూజారితో కలిసి ఆలయంలోకి ప్రవేశించి పరిశీలించారు. చెన్నకేశవస్వామి వెండి కన్ను, నాలుగు చీరెలు, వన్‌గ్రామ్ గోల్డ్ వడ్డాణం కనిపించకపోవడం, ఆలయఆవరణలో ఉన్న హుండీ ధ్వంసమై ఉండటంతో చోరీ జరిగినట్లుగా భావించారు. దీంతో పాటు పక్కనే ఉన్న శివాలయంలో సైతం చోరీ చేసేందుకు దొంగలు ప్రయత్నించారు. ముఖద్వార తాళం పగులగొట్టేందుకు చేసిన ప్రయత్నం విఫలమవడంతో వెళ్లిపోయా రు. నెలరోజులుగా భక్తులు సమర్పించుకున్న కానుకలతో పాటు చోరీ జరిగిన స్వామివారి వస్తువుల విలువ సుమారు రూ.10వేల వరకు ఉంటుందని ఆలయ పూజారి తెలిపారు. ఇదే ఆలయ ఆవరణలోని 22 కేజీల ఇత్తడి గంట రెండు నెలల క్రితం చోరీకి గురైనట్లు స్థానికులు తెలిపారు. చోరీపై జరిగిన విషయాన్ని గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో రూరల్ ఎస్ఐ ఆధ్వర్యంలో పోలీసులు దేవాలయం వద్దకు చేరుకొని చోరీ జరిగిన తీరును పరిశీలించారు. అనంతరం నల్లగొండ నుంచి వచ్చిన క్లూస్ టీం పరిశీలించి కొన్ని ఆధారాలు సేకరించింది. ఆలయ పూజారి మనీష్‌గౌతమ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ నరేష్ తెలిపారు.

ప్రజావాణిలో 38 దరఖాస్తుల స్వీకరణ

కొండమల్లేపల్లి, ఆగస్టు 19: కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 38 దరఖాస్తులు స్వీకరించినట్లు ఎంపీడీవో రాంరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో డీటీ ప్రశాంత్‌కుమార్, ఏపీఎం బొడ్డు శ్రీనివాస్, ఇరిగేషన్, మిషన్ భగీరథ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా కల్యాణ మహోత్సవం

కనగల్, ఆగస్టు 19: కనగల్ ఎక్స్ రోడ్డులోని శ్రీ భూనీల సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ తృతీయ వార్షికోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణలు, సన్నాయివాయిద్యాలు, మేళతాళాలు నడుమ కనుల పండువగా జరిగింది. కనగల్‌తో పాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధికసంఖ్యలో హాజరైయ్యారు. తలంబ్రాలు, ఒడి బియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త బుసిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ చిట్ల లింగయ్య గౌడ్, అర్చకులు వెంకటచార్యులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి అవార్డును అందుకున్న విజయ్



విజయ్‌కు అవార్డు అందజేస్తున్న మంత్రి పొంగులేటి

నల్లగొండ కల్చరల్, ఆగస్టు 19: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర సమాచార శాఖ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లోని గ్రీన్‌పార్కులో ఏర్పాటు చేసి వేడుకల్లో నల్లగొండ 'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్‌కు రాష్ట్రస్థాయి ఉత్తమ ఫొటోగ్రఫీ అవార్డు లభించింది. సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి బెస్ట్ ఫొటోగ్రఫీ అవార్డును అందజేశారు. సమాచార శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఫొటోగ్రఫీ పోటీల్లో విజయ్‌కుమార్ రైతు భరోసా' అనే అంశంపై కేటగిరి -1 విభాగంలో, మహాలక్ష్మి విభాగంలో రెండు కన్సోలేషన్ బహుమతులు అందుకున్నారు.

ఆనందోత్సాహాలతో రాఖీ వేడుకలు


ఎమ్మెల్యే వీరేశానికి రాఖీ కడుతున్న మహిళలు


ఎమ్మెల్యే బీఎల్ఆర్‌కు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలుపుతున్న పట్టణ మహిళలు


మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డికి, ఆయన సోదరుడు కృష్ణారెడ్డికి రాఖీ కడుతున్న సోదరీమణులు


విద్యార్థి సంఘం నాయకులకు రాఖీ కడుతున్న విద్యార్థినులు

అన్నా చెల్లెళ్ల, అక్కాతమ్ముళ్ల అనుబంధానికి ప్రతీకైన రక్షాబంధన్ వేడుకలను సోమవారం జిల్లాలో ప్రజలు ఆనందోత్సాహాలతో నిర్వహించారు. సంస్కృతి, ఆచారాలను ప్రతిబింబించేలా, ఇళ్లల్లో రాఖీ పండుగను ఆత్మీయత, అనురాగంతో నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఒకరికొకరు మిఠాయిలను తినిపించుకున్నారు. ఈ సందర్భంగా అక్కా చెల్లెళ్లకు, అన్నాతమ్ముళ్లకు స్థాయికి తగినట్లుగా కొందరు నగదును, మరికొందరు చీరలు పెట్టారు. ఎలాంటి అరమరికలు లేకుండా కష్ట సుఖాల్లో పాలు పంచుకుందామని అంటూ స్వీట్లు తినిపించుకున్నారు.


చాడ కిషన్‌రెడ్డికి రాఖీ కడుతున్న సోదరీమణులు




చిన్నారుల 'రాఖీ' సందడి: పీఏపల్లి, కొండమల్లేపల్లి, చింతపల్లి, మునుగోడులో చిన్నారుల


మిర్యాలగూడ పట్టణంలో...



రాఖీ కట్టేందుకు ఆడపిల్లను కాపాడుకుందామనే సందేశాన్ని ప్రదర్శిస్తున్న విద్యార్థులు


చిట్యాల : రాఖీ సంబురాల్లో పాల్గొన్న మహిళలు


దేవరకొండ: రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలుపుతున్న చిన్నారులు


కనగల్ : సోదరుడికి రాఖీ కట్టి మొక్కను అందిస్తున్న చెల్లెళ్లు

మధ్యాహ్న పథకాన్ని ఏజెన్సీలతోనే కొనసాగించాలి



డీఈవో కార్యాలయం ఎదుట మధ్యాహ్న భోజన కార్మికుల నిరసన

నల్లగొండ రూరల్, ఆగస్టు 19: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని ఏజెన్సీలతో నిర్వహించాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సీఐటీయూ) జిల్లా కార్యదర్శి పోలే సత్యనారాయణ డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం డీఈవో కార్యాలయం ఎదుట మధ్యాహ్న కార్మికులు నిర్వహించిన ఆందోళన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథక నిర్వాహణను హరే రామ, హరే కృష్ణ ఫౌండేషన్ కి ఇచ్చే ప్రతిపాదనలను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని అన్నారు. 24 సంవత్సరాలుగా మధ్యాహ్న భోజన పథకంలో కార్మికులు అనేక కష్టనష్టాలకు ఓర్చి పని చేస్తున్నారని, వీరిలో అత్యధికులు ఎస్సీ, ఎస్టీ వెనుకబడిన తరగతులకు చెందిన వారేనని అన్నారు. ప్రభుత్వం వారి పొట్ట కొట్టవద్దని కోరారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి సానుకూలమైన ప్రకటనలు చేసి పెండింగ్ బిల్లులు విడుదల చేసి కార్మికులని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేనిచో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అందించారు. కార్యక్రమంలో నాయకులు అనురాధ, చింత, సంగీత, పలువురు కార్మికులు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్ వృత్తి సృజనాత్మకమైనది


కొండమల్లేపల్లిలో నివాళులర్పిస్తున్న ఫొటోగ్రాఫర్లు

నల్లగొండ రూరల్, కొండమల్లేపల్లి, చిట్యాల, కనగల్, ఆగస్టు 19: ఫొటోగ్రాఫర్ వృత్తి సృజనాత్మకమైనదని పలువురు పేర్కొన్నారు. ప్రపంచ ఫొటోగ్రాఫర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం జిల్లాలోని పలు మండలాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కెమెరా సృష్టికర్త, ఫొటోగ్రాఫర్ల పితామహుడు లూయిస్ డాగొరే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కేక్ కట్‌చేసి ఫొటోగ్రాఫర్లకు శుభాకాంక్షలు తెలియజేశారు.

● ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని నల్లగొండ జిల్లా ఫొటోగ్రాఫర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం అదనపు కలెక్టర్ శ్రీనివాస్ కేక్ కట్ చేసి ఫొటోగ్రాఫర్లకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో శేఖర్‌రెడ్డి, జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

● కొండమల్లేపల్లిలో ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో లూయిస్ చిత్రపటానికి పూలమాలు వేసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు ఎస్‌డీ. పాషా, అధ్యక్షుడు జి.సురేష్, కోశాధికారి శంకర్, ఉపాధ్యక్షులు బి.రామకృష్ణ, జి.యాదగిరి, శ్రీనివాస్, ఆర్.సతీష్, పాషా, రామకృష్ణ, వెంకటేష్, మహేష్, ఆశీర్వాద్, పరమేష్ పాల్గొన్నారు.

● చిట్యాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్ల సంఘం మండల అధక్షుడు దేవనబోయిన సైదులు, ఏళ్ల బయ్యన్న, ఆవుల ఆనంద్, కూరాకుల సుధీర్, లింగస్వామి పాల్గొన్నారు.

● కనగల్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ విష్ణుమూర్తి ప్రపంచ ఫొటోగ్రాఫర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఫొటోగ్రాఫర్ల సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో లూయిస్ డాగొరే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్‌చేసి ఫొటోగ్రాఫర్లకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్ల సంఘం మండల అధ్యక్షుడు జెట్టిరాజు, ప్రధానకార్యదర్శి నాగరాజు, ఉపాధ్యక్షుడు సురిగల శ్రీహరి, కార్యవర్గ సభ్యులు బచ్చనగోని శివరాజు విష్ణు, సతీష్, మహేందర్, కృష్ణ పాల్గొన్నారు.

వైభవంగా గాయత్రీహోమం, యజ్ఞోపధారణ


కట్టంగూరు : గాయత్రీ హోమంలో పాల్గొన్న పద్మశాలీ సంఘం నాయకులు

కట్టంగూరు, చిట్యాలరూరల్, ఆగస్టు 19: జంధ్యాల పూర్ణిమ సందర్భంగా కట్టంగూరు గ్రామపంచాయతీ పరిధిలోని పద్మశాలీ కాలనీలో గాయత్రీ హోమం వైభవంగా నిర్వహించారు. సోమవారం పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన హోమంలో పద్మశాలీ కులస్థులు నూతన జంధ్యాలు ధరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమాన్ని రామడుగు శ్రీనివాస్ శర్మతో నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు అంజన్‌కుమార్, పాండరి, మల్లికార్జున్, గంజి వెంకటేశ్వర్లు, గంగయ్య, ఉమేష్, ప్రసాద్, మల్లయ్య, గోవర్ధన్, శ్రవణ్‌కుమార్, ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

● చిట్యాల మండలం నేరడ గ్రామంలోని ఆంజనేయస్వామి దేవాలయంలో విశ్వక్సేన పూజ, గాయత్రి హోమం, యజ్ఞోపవీత ధారణను ఘనంగా నిర్వహించారు. పాండురగాచార్యుల అర్చకత్వంలో హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రతీ శ్రావణ పౌర్ణమికి నూతన యజ్ఞోపవీతాన్ని ధరించనున్నట్లు తెలిపారు.

'డిండి' పథకానికి డీపీఆర్‌ను ఆమోదించాలి

చండూరురూరల్, ఆగస్టు 19: డిండి ఎత్తిపోతల పథకాన్ని డీపీఆర్‌ను ఆమోదించాలని సీపీఎం మండల సహాయ కార్యదర్శి జెర్రిపోతుల ధనుంజయగౌడ్ డిమాండ్ చేశారు. చండూరు మండలంలోని నెర్మట గ్రామంలో సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో నిత్యం కరువు, కాటకాలకు గురయ్యే ఫ్లోరైడ్ ప్రాంతాలైన మునుగోడు, దేవరకొండ, నియోజకవర్గాలకు సాగునీరు అందించాలని ప్రారంభించిన డిండి పథకాన్ని వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. రిజర్వాయర్లకు సంబంధించిన పనులు కొంత మేరకు జరిగినా కీలకమైన డీపీఆర్‌ను వెంటనే ఆమోదించడం, విధంగా 27 కిలోమీటర్ల కాల్వలు తవ్వే పనులకు సంబంధించిన పర్యావరణ అనుమతుల కోసం లేఖలు రాయడం లేదని అన్నారు. ప్రభుత్వం స్పందించి డిండి ఎత్తిపోతల పథకానికి డీపీఆర్ ఆమోదింపజేసి అధిక నిధులు కేటాయించి, ప్రాజెక్టు పూర్తయ్యే విధంగా చూడాలని డిమాండ్ చేశారు. లేనిచో సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

దళారీ వ్యవస్థ నిర్మూలనకు కృషి : సైదులు

నల్లగొండ, ఆగస్టు 19: దళారీ వ్యవస్థ నిర్మూలనకు కృషి చేస్తానని వరల్డ్ కన్స్యూమర్స్ రైట్స్ సంస్థ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పొట్టబత్తుల సైదులు అన్నారు. నల్లగొండలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాణ్యమైన ఆహార పదార్థాలు వినియోగదారులకు అందించడమే ప్రధాన లక్ష్యమన్నారు. వినియోగదారుల సేవల్లో వస్తువుల నాణ్యతలో ఎలాంటి లోపాలు ఉన్నా తమకు తెలియజేయాలని అన్నారు. వినియోగదారుల ప్రయోజనాల కోసం కృషి చేస్తానని అన్నారు. రెండోసారి కూడా ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ హయాంలోనే వరదకాల్వ నీరు

మాడ్గులపల్లి, ఆగస్టు 19: కాంగ్రెస్ పార్టీ హయాంలోనే వరదకాల్వకు నీటిని విడుదల చేయడంతో పాటు చివరి భూములకు సాగునీరు అందిస్తుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు గడ్డం వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్లే కాల్వలు అధ్వానంగా మారాయని అన్నారు. వరదకాల్వకు నీరు వస్తుందన్న ముందస్తు సమాచారంతోనే మంత్రి కోమటిరెడ్డి, ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి సహకారంతో కాల్వల్లోని కంపచెట్లను తొలగించే కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి ఎక్కువ నీటిని విడుదల చేయడం ద్వారా మాడ్గులపల్లి మండలంలోని అన్ని చెరువులను నింపేందుకు కృషి చేస్తామన్నారు.

కరాటే పోటీల్లో బంగారు పతకాలు

నల్లగొండ స్పోర్ట్స్, ఆగస్టు 19: టైగర్ కుంగ్‌ఫూ అకాడమీ ఆధ్వర్యంలో భువనగిరిలోని ఎమ్ఎన్ గార్డెన్‌లో నిర్వహించిన 4వ జాతీయ స్థాయి ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో పలువురు విద్యార్థులు ప్రతిభ చాటారు. ఆదివారం జరిగిన ఫైనల్‌లోని వివిధ విభాగాల్లో నల్లగొండ పట్టణం లిటిల్ ఫ్లవర్ స్కూల్ షావలిన్ షోటోఖాన్ స్పోర్ట్స్ కరాటే ఇండియాకు చెందిన విద్యార్థులు రెండు గోల్డ్, ఒకటి సిల్వర్, 5 బ్రాంజ్ మెడల్స్ సాధించారు. పతకాలు సాధించిన వారిలో ఫిర్దోస్, మనీస్ బంగారు, ప్రణదీప్ సిల్వర్, సహజ, హైమావతి, ధనుష్, కార్తికేయ, అభినవ్, సమీర్ బ్రాంచ్ మెడల్స్ అందుకున్నారు. పతకాలు సాధించిన క్రీడాకారులను పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ శాంతామేరి, కరాటే చీఫ్ ఎగ్జామినర్ నాంపల్లి కనకారావు, రాజు, ప్రశాంతి, నయూం అభినందించారు.

ఎమ్మెల్సీ కోదండరాంను కలిసిన నేతలు

మిర్యాలగూడ టౌన్, ఆగస్టు 19: ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసిన ప్రొఫెసర్ కోదండరాంను తెలంగాణ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకుడు లావూరి క్రాంతికుమార్ మాట్లాడుతూ రాష్ట్ర సాధనలో దిక్సూచిగా వ్యవహరించిన కోదండరాంకు మంత్రి పదవి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ జన సమితి నేతలు పన్నాల గోపాల్‌రెడ్డి, నాగేశ్వరరావు, మురళీయాదవ్, వీరనాయక్, జగన్నాథం, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ధ్వంసం చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలి

చింతపల్లి, ఆగస్టు 19: చింతపల్లి మండలంలోని మల్లారెడ్డి గ్రామంలోని పల్లె ప్రకృతి వనంలో చెట్లను నరికిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ కోరారు. సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పల్లెప్రకృతి వనంలో నిబంధనలకు విరుద్ధంగా చెట్లను ధ్వంసం చేశారని అన్నారు. ఈ విషయాన్ని జిల్లా స్థాయి అధికారులకు సమాచారం అందించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టనున్నట్లు ఎస్ఐ యాదయ్య తెలిపారు.

సంక్షిప్త సమాచారం...

చందంపేట: చందంపేట మండలంలోని చిత్రియాల గ్రామంలో శ్రీకంఠ మహేశ్వరస్వామి విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన పూజా కార్యక్రమాలను ఈ నెల 20, 21 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు సోమవారం తెలిపారు. శ్రీకంఠ మహేశ్వరస్వామి దేవాలయంలో మంగళవారం విగ్రహ ప్రతిష్ఠ, బుధవారం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన, గురువారం బోనాల కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకోవాలని కోరారు.


నరేష్

మాడ్గులపల్లి: కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ మండల అధ్యక్షుడిగా బొంగరాల నరేష్ నియమితులయ్యారు. ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు బోడ స్వామి నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తానన్నారు. కార్యక్రమంలో పందిరి సతీష్, వంటిపాక వినయ్ పాల్గొన్నారు.

శాలిగౌరారం: బ్యాంకులో రుణాలు తీసుకున్న ప్రతీ రైతుకు రుణమాఫీ చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు జమ్ము రమేష్ డిమాండ్ చేశారు. ఒక కుటుంబంలో ఎంత మంది రైతులు రుణం తీసుకున్నా రుణమాఫీ చేయాలని అన్నారు. ఆధార్ కార్డు, భూమి పాస్‌బుక్ ప్రకారం ఎలాంటి నిబంధనలు లేకుండా తక్షణమే రుణమాఫీ చేయాలని కోరారు. రుణమాఫీకి ప్రభుత్వం పెట్టిన నిబంధనలు వెంటనే పంపించాలన్నారు.

శాలిగౌరారం: మండలంలోని తక్కళ్లపహాడ్ గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు అబ్బగోని సత్తయ్య(70) అనారోగ్యంతో మృతి చెందాడు. సత్తయ్య మృతదేహంపై కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, నాయకులు ఇంతియాజ్ అహ్మద్, మల్లయ్య, సురేందర్‌రెడ్డి, జానయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మునుగోడు రూరల్: మండలంలోని చీకటిమామిడి గ్రామానికి చెందిన కొంపల్లి యాదయ్య నరసమ్మ కుమార్తె వివాహానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వట్టికోటి శేఖర్ రూ.15వేల నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు కొంత సహాయం చేయడం సంతృప్తికరంగా ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు భీమనపల్లి సైదులు, పీఏసీఎస్ డైరెక్టర్ వట్టికోటి వెంకటేష్, పాలకూరి యాదయ్య, జేవీ గౌడ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

దేవరకొండ: దేవరకొండ ఎక్సైజ్ స్టేషన్‌లో వివిధ కేసుల్లో పట్టుబడి సీజ్ చేసిన వాహనాలకు ఈ నెల 22వ తేదీన ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆదేశాల మేరకు వేలంపాట నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. ఆసక్తి గలవారు ఈ నెల 22న ఉదయం 10 గంటలకు ఎక్సైజ్ కార్యాలయంలో తమపేరు నమోదు చేసుకొని రూ.10వేలు డిపాజిట్ చేసి వేలంపాటలో పాల్గొనాలని కోరారు.

డిండి: మండల కేంద్రానికి చెందిన ఆడెపు పార్వతమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందింది. నిరుపేద కుటుంబం కావడంతో స్థానిక యువకులు ఆమె భర్త ఆడెపు లింగమయ్యకు సోమవారం రూ.10వేల నగదు ఆర్థికసాయం అందజేశారు. డిండి మండల కేంద్రానికి చెందిన 28 మంది యువకులు కుల,మతాలకతీతంగా మృతి చెందినవారి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేస్తున్నారు. కార్యక్రమంలో మునగపాటి శ్రీను, బాదమోని శ్రీనివాస్‌గౌడ్, పున్న దినేష్, కృష్ణ, నరేష్, గోవర్ధన్ పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి: శబ్ద కాలుష్యానికి పాల్పడే డీజే నిర్వాహకులపై కేసు నమోదు చేస్తామని ఎస్ఐ క్రాంతికుమార్ హెచ్చరించారు. మండలంలోని డీజే సౌండ్ సిస్టం నిర్వాహకులతో పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలీసుల అనుమతి లేకుండా ఇష్టారీతిన చెవులు చిల్లులు పడేలా సౌండ్‌లు పెట్టే డీజేలను సీజ్ చేస్తామన్నారు. తమ అనుమతి లేనిదే పెళ్లిళ్లు, ఉత్సవాలు, వేడుకలకు డీజేలను ఆపరేట్ చేయవద్దని సూచించారు.

చిట్యాల: ముత్యాలమ్మగూడెంకు చెందిన ఎస్‌కె బిక్కుమియా అనారోగ్యానికి గురై ఇంటి వద్ద ఉంటుండగా బీఆర్ఎస్ నాయకుడు కోనేటి ఎల్లయ్య రూ. 5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో ఆగు అశోక్, రావుల వెంకన్న, ఇరగదిండ్ల గణేష్, జిట్ట శేఖర్ పాల్గొన్నారు.

10క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

దేవరకొండ: దేవరకొండ మండలం వైదోనివంపు గ్రామంలో నల్లగాసు కొండల్ ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన 10 క్వింటాళ్ల రేషన్‌బియ్యాన్ని దేవరకొండ డీటీసీఎస్ హనుమంతు శ్రీనివాస్‌గౌడ్ సోమవారం పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్‌బియ్యాన్ని వినియోగదారుల నుంచి కొండల్ తక్కువ ధరకు కొనుగోలు చేసి బ్లాక్ మార్కెట్‌లో విక్రయిస్తున్నాడని అన్నారు. పోలీస్, పౌరసరఫరాలశాఖ ఆధ్వర్యంలో తనిఖీ చేసి ఇంట్లో నిల్వ చేసిన 10 క్విం టాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడు కొండల్‌పై కేసు నమోదు చేసినట్లు శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.

కిరాణ దుకాణంలో చోరీకి యత్నం

నిడమనూరు, ఆగస్టు 19: నిడమనూరు మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న ఓ కిరాణం దుకాణంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి విఫలయత్నం చేశారు. ఈ సంఘటన ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ నర్సింహ కిరాణ దుకాణం యజమాని మిర్యాల శ్రీధర్ ప్రతిరోజు మాదిరిగానే తన దుకాణాన్ని ఆదివారం రాత్రి మూసివేసి ఇంటికి వెళ్లాడు. మరుసటి రోజు ఉదయం దుకాణం తెరిచేందుకు రాగా దుకాణం షట్టర్ దెబ్బతిని ఉండటం గమనించి చోరీ ప్రయత్నం చేసినట్లు గుర్తించాడు. కొందరు గుర్తు తెలియని దొంగలు కిరాణం దుకాణంలో చోరీ చేసేందుకు అర్ధరాత్రి వచ్చి షట్టర్‌కు ఉన్న తాళాలు పగులగొట్టి షట్టర్ తెరిచేందుకు ప్రయత్నించినా సాధ్యం కాలేదు. దీంతో దొంగలు దుకాణంలో సామగ్రిని అపహరించలేకపోయారు. షట్టర్ పగులగొట్టేందుకు దొంగలు గునపాలు ఉపయోగించినట్లు తెలుస్తోంది. దుకాణంలో ఎలాంటి దొంగతనం జరగకపోవడంతో యజమాని ఊపిరి పీల్చుకున్నా రు. కిరాణ దుకాణంలో చోరీ యత్నంపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.